క్లుప్తంగా

శ్రీకృష్ణుడి ఆలయం ప్రారంభం



ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన చేస్తున్న భక్తులు

ఖమ్మంరూరల్: మండలంలోని తెల్దారుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణుడి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గత మూడు రోజులుగా ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు ప్రతీ ఇంట్లో బంధుమిత్రుల రాకతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. దాదాపు 25 వేల మంది భక్తులు శ్రీకృష్ణుడి దర్శించుకోగా భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

రేపు గ్రీన్‌ఫీల్డ్ హైవే సమస్యపై సమావేశం

రఘునాథపాలెం: తీర్థాల, మంగళగూడెం, కామంచికల్, రేగులచెలక, మల్లెమడుగు, రఘునాథపాలెం, బల్లేపల్లి, వి.వెంకటాయపాలెం గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధిత రైతులు ఈ నెల 7వ తేదీన ఖమ్మంలోని మంచికంటి భవన్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్లు బాధిత రైతులు ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల సమస్యలపై చర్చించే ఈ సమావేశానికి బాధితులంతా సకాలంలో హాజరుకావాలని కోరారు.

దేవతా విగ్రహాలకు జలాభిషేకం

కూసుమంచి: మండలంలోని జక్కేపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీఅంకమ్మ తల్లి, పోతురాజు స్వామి విగ్రహాల ప్రతిష్ఠ శనివారం జరుగనుండగా శుక్రవారం గ్రామస్తులు విగ్రహాలకు జలాభిషేకం నిర్వహించి పూజలు చేశారు. ఈ సందర్భంగా సుప్రభాతసేవ, వేద పారాయణం, దేవతా హోమాలను అర్చకులు ఇంగువ సంగమేశ్వర ప్రసాద్ ఆధ్వర్యాన వేద పండితులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు తిప్పని వెంకటరెడ్డి, కళావతి దంపతులతో పాటు కుమారులైన శ్రీనివాసరెడ్డి, అశోక్‌రెడ్డి పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

ఖమ్మం మామిళ్లగూడెం: ఆయుర్ రక్ష, ఆయుర్వేదిక్ హాస్పిటల్ అండ్ కేరళ పంచకర్మ సెంటర్ ఆధ్వర్యాన ఈ నెల 7వ తేదీన గాంధీచౌక్‌లోని వర్తక సంఘ భవనంలో ఉచిత ఆయుర్వేద మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు డాక్టర్ పి.పూజిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత క్యాంపు నిర్వహిస్తున్నందున ప్రతి ఒక్కరూ సమయానికి హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

9న త్యాగరాజ ఆరాధనోత్సవాలు

ఖమ్మంగాంధీచౌక్: శ్రీ త్యాగరాజ స్వామి వారి పంచదశ ఆరాధన మహోత్సవాలను ఈ నెల 9వ తేదీన నగరంలోని బైపాస్‌రోడ్డులో గల్ ఎఫ్‌సీఐ గోదాం దగ్గర ఉన్న ఎంబీ గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు శ్రీవారిదాసుడు, నాదస్వర విద్వాంసుడు డాక్టర్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 10:30 గంటలకు ప్రముఖ విద్వాంసులచే నాదస్వర కచేరీ నిర్వహిస్తున్నందున కళాకారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సలార్
వినోద	హాయ్‌నాన్న
సాయిరాం	డెవిల్
ఆదిత్య	యానిమల్
శ్రీనివాస	బబుల్‌గమ్

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	30	బచ్చలికూర	3
వంకాయ	30		20
బెండకాయ	56	పాలకూర	3
పచ్చిమిర్చి	46		20
కాకర	70	చుక్కకూర	3
బీర	56		20
దొండ	30	తోటకూర	2
పొట్లకాయ	40		10
నాటు చిక్కుడు	120	గోంగూర	2
గోరుచిక్కుడు	56		10
క్యాబేజీ	24	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	36		20
ఆలుగడ్డ	30	కొత్తిమీర	1
చామగడ్డ	56		30
క్యారెట్	56	పుదీన	1
క్యాప్సికం	80		20

-ఖమ్మం వ్యవసాయం

నీటి ఎద్దడి రానివ్వొద్దు..

- ముందస్తు ప్రణాళికలతో సమస్యలను అధిగమించాలి
- సమీక్షా సమావేశంలో కలెక్టర్ వీ.పీ.గౌతమ్



కేఎంసీలో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మంమయూరిసెంటర్: రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకొని జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల్లో నీటి ఎద్దడి రాకుండా ఉండేందుకు ముందస్తు ప్రణాళికలతో సమర్థవంతంగా నీటి సరఫరాను అందించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ వి.పి.గౌతమ్ ఆదేశించారు. శుక్రవారం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరంలో వేసవి కాలంలో తాగునీటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు అన్ని రకాల ముందస్తు జాగ్రత్త చర్యలపై ఆర్‌డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్, ఇరిగేషన్, విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 4 మున్సిపాలిటీలు, 589 గ్రామాల నివాస ప్రాంతాల్లోని జనాభా ఎంత, జనాభాకు సరిపోయేంత నీరు లభ్యతపై వివరాలపై సమీక్షించారు. జిల్లాలో ఉన్న తాగునీటి వనరులు, వాటిలో నీటి లభ్యతపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.

తాగునీటి లభ్యత ప్రాంతాలివే..

ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో అమృత్ పథకం కింద 18 ఈఎల్ఎస్ఆర్‌ల నిర్మాణం చేపట్టి 16 నిర్మాణాలు పూర్తి చేసి వాడకంలోకి తీసుకురాగా మిగతా 2 నిర్మాణాలను వారంలోగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలన్నారు. 685 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ ఏర్పాటు పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. సత్తుపల్లి మున్సిపాలిటీలో ఒక సీఎల్ఎస్ఆర్, 27.42 కిలోమీటర్ల పైప్‌లైన్ పనులు మంజూరు కాగా 93 శాతం మేర పనులు పూర్తయినవని, మిగులు పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మధిర పట్టణంలో 104.01 కిలోమీటర్ల పైప్‌లైన్, 5 నిర్మాణాలు మంజూరు కాగా 91 శాతం పనులు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు.

సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టి..

గతేడాది అనుభవాలను దృష్టిలో పెట్టుకొని సమస్యాత్మక ప్రాంతాల్లో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. తాగునీటి సరఫరాకు చేపట్టాల్సిన పనుల మంజూరుకు ప్రతిపాదనలు ఉన్నచోట వెంటనే సమర్పించాలన్నారు. కార్యాలయాలు, డే, రెసిడెన్షియల్ విద్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, హెల్త్ సబ్ సెంటర్లు తదితర అన్ని ప్రభుత్వ సంస్థల్లో మిషన్ భగీరథ కనెక్షన్లు ఇచ్చి, నీటి సరఫరా చేయాలని పేర్కొన్నారు. ఈ సమీక్షలో ఖమ్మం మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణ సహాయ కలెక్టర్ మయాంక్ సింగ్, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రంజిత్, మిషన్ భగీరథ ఎస్ఈ సదా శివకుమార్, ఈఈలు పుష్పలత, వాణిశ్రీ, ఇర్రిగేషన్ ఈఈ వెంకటేశ్వరరావు, మున్సిపల్, విద్యుత్, ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు..

అర్హులకు ప్రభుత్వ పథకాలు అమలు చేసేందుకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తు స్వీకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రజాపాలన కేంద్రాలకు వచ్చే ప్రతి దరఖాస్తును తిరస్కరించకుండా తీసుకోవాలని తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమానికి వచ్చిన ప్రజలతో కలెక్టర్ మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ గ్యారంటీ పథకాలతో పాటు ఏ ఇతర అంశాలపై ప్రజలు అధికంగా దరఖాస్తు సమర్పిస్తున్నారనే అంశాన్ని కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్వీకరణ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌లలో దరఖాస్తులను నింపడంలో ఏవైన సందేహాలుంటే నివృత్తి చేస్తారని అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.



కేఎంసీ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఏపీలో మంత్రి తుమ్మల ప్రత్యేక పూజలు

ఖమ్మంవన్‌టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మైలవరంలో శ్రీ దండాయుధపాణి స్వామిని శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దర్శించుకున్నారు. ఆలయంలో జరుగుతున్న చండీసహిత అతిరుద్ర మహాయజ్ఞంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు సాధు రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దండాయుధపాణి స్వామిని దర్శించుకున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తదితరులు

మంత్రి తుమ్మలను కలిసిన దేవాదాయ అధికారులు..

ఖమ్మంగాంధీచౌక్: రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును శుక్రవారం ఖమ్మంలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు, ఉద్యోగులు, అర్చకులు మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రికి శ్రీ గుంటు మల్లన్నస్వామి వారి జ్ఞాపికను అందించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా దేవాదాయ, ధర్మాదాయ సహాయ కమిషనర్ ఎ.సులోచన, సూపరింటెండెంట్ గౌరీశంకర్, ఇన్‌స్పెక్టర్ రెంటాల సమత, ముఖ్య కార్యనిర్వాహణాధికారి కొత్తూరు జగన్మోహన్‌రావు, తోటకూరి వెంకటేశ్వర్లు, దాములూరి వీరభద్రరావు, కాశవజ్జుల రామశర్మ, ఎస్‌బీ కృష్ణమాచార్యులు, శ్రీనివాస్, మురళి తదితరులు పాల్గొన్నారు.

'త్రివేణి' క్యాలెండర్లు ఆవిష్కరణ..

ఖమ్మం సహకారనగర్: త్రివేణి పాఠశాలల ఆధ్వర్యాన రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్లను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో త్రివేణి ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, కృష్ణవేణి, త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, సీఆర్వో కాట్రగడ్డ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, వివిధ విభాగాల ఇన్‌చార్జ్‌లు ముస్తాఫా, అశోక్, చార్లెస్ తదితరులు పాల్గొన్నారు.



త్రివేణి స్కూల్ క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి

మూడు కేంద్రాలు.. 30 కౌంటర్లు..

నేలకొండపల్లి: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన గ్రామ సభలను విజయవంతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తున్నారు. శుక్రవారం నేలకొండపల్లి మేజర్ పంచాయతీలో ప్రజల సౌకర్యార్థం మూడు ప్రత్యేక కేంద్రాల్లో 30 కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఈ ఏర్పాట్లను పాలేరు డివిజన్ స్పెషల్ ఆఫీసర్ కొండపల్లి శ్రీరామ్, మండల స్పెషల్ ఆఫీసర్ రమణ, ఎంపీపీ రమ్య, ఎంపీడీఓ కె.జమలారెడ్డి, మండల పంచాయతీ అధికారి శివ, సర్పంచ్ రాయపూడి నవీన్, ఉప సర్పంచ్ లక్కం ఏడుకొండలు, స్థానిక నాయకులు జెర్రిపోతుల సత్యనారాయణ, మైశా శంకర్, వంగవీటి నాగేశ్వరరావు, కడియాల నరేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొని పరిశీలించారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ జమలారెడ్డి

రైతుబంధు వెంటనే జమ చేయాలి

నేలకొండపల్లి: తెలంగాణ నూతన ప్రభుత్వం వెంటనే రైతు బంధును రైతుల ఖాతాల్లో జమ చేయాలని రైతు సంఘం జిల్లా నాయకుడు గుడవర్తి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని రావెళ్ల భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం డిసెంబర్‌లోనే రైతుల ఖాతాలో జమ చేసేదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీని వెంటనే అమలు చేయాలన్నారు. రహదారుల వెంట ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు పట్టాలు ఉచితంగా అందించాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ రచ్చా నరసింహారావు, సంఘం నాయకులు కట్టికోల వెంకటేశ్వర్లు, చింతలపాటి భాస్కర్, తెల్ల మేకల శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

'ఉపాధి'కి ఆధార్ కార్డు లింక్ పెట్టొద్దు..



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

తిరుమలాయపాలెం: వ్యవసాయ కార్మికుల జాబు కార్డుకు ఆధార్‌కార్డు లింక్ పెట్టి కూలీ వేతనాలను దోపిడీ చేస్తున్నారని, అటువంటి లింక్‌ను పెట్టడం సరికాదని సంఘం జిల్లా అధ్యక్షుడు మేరుగు సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. వామపక్షాల ఉద్యమం మేరకు కేంద్రం తీసుకొచ్చిన చట్టాన్ని నేడు బీజేపీ నిర్వీరం చేసేందుకు బడ్జెట్‌ను తగ్గిస్తున్నారని అన్నారు. ఆధార్ కార్డు లింక్ పేరుతో జాబు కార్డులను తగ్గిస్తున్నారని చెప్పారు. మోదీ తీసుకునే విధానాలతో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ దుర్మార్గ చర్యలను ఎండగట్టేందుకు ఉద్యమం ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్, యర్రా శ్రీనివాస్, కొమ్ము శ్రీను, నర్సయ్య, కె.నాగేశ్వరరావు, వరదయ్య తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ క్యాలెండర్లు ఆవిష్కరణ



క్యాలెండర్ల ఆవిష్కరణలో ఎంఈఓ, యూనియన్ నాయకులు

కూసుమంచి: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) ఆధ్వర్యాన ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లను శుక్రవారం ఎంఈఓ బీవీ రామాచారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన సంవత్సరంలో ఉపాధ్యాయులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. ఫిబ్రవరి 11, 12వ తేదీల్లో ఖమ్మంలో జరిగే రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యూనియన్ జిల్లా నాయకులు మల్లయ్య, రాంకోటి, మండల అధ్యక్ష, కార్యదర్శులు దేవేందర్, శంకర్, నాయకులు భాస్కర్, నర్సింహారావు, యాకయ్య, భద్రూ, బాబూరావు, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ నగర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సంగయ్య



సంగయ్యకు నియామక పత్రం అందిస్తున్న కొత్తా సీతారాములు

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం నగర ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొంగర సంగయ్యను నియమిస్తూ శుక్రవారం జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు కొత్తా సీతారాములు నియామక పత్రం అందజేశారు. గత 25 ఏళ్లుగా ప్రైవేట్ రిఫ్రిజిరేషన్ అండ్ ఏసీ యూనియన్ సమావేశంలో ఆ సంఘం తరపున పోరాటం చేస్తున్న సంగయ్యను నియమించడం పట్ల పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పమ్మి వెంకటేశ్వరరావు, నరాల నరేష్‌నాయుడు, అద్దంకి హరిబాబు, యూనియన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గడపగడపకూ రామయ్య అక్షింతలు

నేలకొండపల్లి/ఖమ్మంఅర్బన్: అయోధ్యలోని శ్రీరామ మందిర ప్రతిష్ఠలో భాగంగా దేశ వ్యాప్తంగా సాగుతున్న అక్షింతల పంపిణీ కార్యక్రమం శుక్రవారం మండలాల్లో కొనసాగుతున్నాయి. నేలకొండపల్లి మండలకేంద్రంలోని సత్యసాయి బాబా మందిరానికి చేరిన అక్షింతలను చెరువుమాధారంలో మంగళ వాయిద్యాలతో ఆలయ కమిటీ ప్రతినిధులు ఇంటింటికీ పంపిణీ చేశారు. అలాగే స్వయంబు శ్రీ అభయవేంకటేశ్వర స్వామి దేవస్థాన కమిటీ ఆధ్వర్యాన ఖమ్మం నగరంలోని బాలాజీనగర్ యూపీహెచ్ కాలనీలో వేడుకగా అక్షింతలను స్థానికులకు పంపిణీ చేశారు. అయోధ్యలో యాగం చేసి పంపించిన అక్షింతలు కావడంతో ప్రజలు అక్షింతలు కోసం పరుగులు పెట్టి తీసుకుంటున్నారు. ఈ కార్యక్రమాల్లో వేంకటేశ్వర స్వామి దేవాలయ అధ్యక్షుడు బొల్లి కొమరయ్య, ప్రధాన కార్యదర్శి పురం తిరుపతయ్య, గౌరవ సలహాదారులు పల్లెబోయిన చంద్రయ్య, దండా జ్యోతి రెడ్డి, సంచలన సమితి జిల్లా బాధ్యులు అల్లిక అంజయ్య, గౌరవ అధ్యక్షుడు మేకల వీరన్న, కోశాధికారి బానోత్ మల్సూర్ నాయక్, బెల్లి కొండలరావు, గుగ్గులోతు మణికంఠ, పల్లపు సత్యం, సుబ్బాచారి, గుర్రం నాగేశ్వరరావు, రాచకొండ వెంకటేశ్వరరావు, రాచకొండ రమేశ్, దాచేపల్లి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మంఅర్బన్: పంపిణీ చేసేందుకు అక్షింతలను తీసుకెళ్తున్న భక్తులు

ఘనంగా స్వయం పాలనా దినోత్సవం

కూసుమంచి: పాలేరులోని వివేకానంద పాఠశాలలో శుక్రవారం స్వయం పాలనా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. పలువురు విద్యార్థులు విద్యాశాఖ మంత్రిగా, కలెక్టర్, డీఈఓ, ఎంఈఓలుగా వ్యవహరించారు. ఇట్టి విద్యార్థులు గ్రామంలోని మహాత్మాగాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈనేపథ్యాన పాఠశాల హెచ్ఎం మురళయ్య విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

బెల్ట్ షాపులను వెంటనే రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శిరోమణి

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజలను తాగుబోతులను చేస్తూ కుటుంబాలను సర్వనాశనం చేసేలా మద్యం విక్రయిస్తున్న బెల్ట్ షాపులను తక్షణమే రద్దు చేయాలని, లేనిఎడల ప్రత్యక్ష ఆందోళనకు పూనుకుంటామని ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.శిరోమణి అన్నారు. శుక్రవారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘ జిల్లా అధ్యక్షురాలు గోకినేపల్లి లలిత అధ్యక్షతన నిర్వహించిన పీఓడబ్ల్యూ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారడంతో యువకులు, పెద్దలు విచ్చలవిడిగా మద్యం సేవించి ఇబ్బందులపాలవుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వమే దీనికి బాధ్యత వహించాలని అన్నారు. గత ప్రభుత్వం ఆదాయాన్ని రాబట్టుకోవటానికి మద్యం దుకాణాల టెండర్లను విచ్చలవిడిగా పెంచి ప్రజలను నష్టాలు పాలు చేసిందని విమర్శించారు. గంజాయి అమ్మకాలు చేసే వారిని, దళారులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంలో ఆరు గ్యారంటీలను పకడ్బందీగా అమలు చేసి అర్హులందరికీ అందించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి ఆవుల మంగుతాయి, జిల్లా సహాయ కార్యదర్శి ప్రతాపనేని శోభరాణి, గోకినేపల్లి సరోజిని, గుడి చుట్టూ వసుమతి, గంట వెంకట నరసమ్మ, పరిమళ, ఇస్లావత్ స్వాతి, బందెల లలిత తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



పండితాపురంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

కామేపల్లి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్ అన్నారు. ప్రజాపాలన కామేపల్లి, పండితాపురం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మల్లిబాబుయాదవ్ మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల కోసం అందరూ దరఖాస్తులను అందించాలని, వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రవిబాబు, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ విజయభాస్కర రెడ్డి, కొండాయిగూడెం సొసైటీ అధ్యక్షుడు ధనియాకుల హనుమంతరావు, సర్పంచ్ మూడ్ దుర్గా జ్యోతి, అజ్మీర అర్జున్, ఉపసర్పంచ్ కొమ్మినేని శ్రీనివాసరావు, కార్యదర్శి పెంద్ర అనిల్‌కుమార్, నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన పరిశీలన..



గట్టుసింగారంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కూసుమంచి: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన అభయహస్తం గ్రామ సభల్లో ఆయా గ్రామాల గ్రామస్తులు దరఖాస్తులను అందజేశారు. దీంతో అధికారులు అట్టి దరఖాస్తులను స్వీకరించి రసీదులు అందజేశారు. తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీడీఓ రమాదేవి, ఎంపీఓ రాంచందర్‌రావు పర్యవేక్షణలో దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు.

51వ డివిజన్‌లో..



దరఖాస్తులు స్వీకరిస్తున్న కార్పొరేటర్ శీలంశెట్టి రమా వీరభద్రం

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 51వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సభను స్థానిక కార్పొరేటర్ శీలంశెట్టి రమా వీరభద్రం ప్రజాపాలన సభను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయించారు. ప్రభుత్వం అందించే పథకాల కోసం దరఖాస్తులు చేసుకునే విధానంపై డివిజన్ ప్రజలకు అవగాహన కల్పించారు.

నేడు ఏడు డివిజన్లలో సభలు..

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరణ శనివారంతో ముగుస్తుందని, చివరి రోజు ఏడు డివిజన్లలో సభలు నిర్వహించిన ప్రజల నుంచి అభయహస్తం దరఖాస్తులు స్వీకరించబడుతుందని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి తెలిపారు. ఉదయం, సాయంత్రం ఆయా డివిజన్లలో దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. 4వ డివిజన్ రాజీవ్‌నగర్‌గుట్ట, పాండురంగాపురం, 12వ డివిజన్ నేతాజీనగర్, పోలీసు హౌజింగ్ కాలనీ, 30వ డివిజన్ పంపింగ్‌వెల్ రోడ్, 31వ డివిజన్ జహీర్‌పుర, 45వ డివిజన్ మామిళ్లగూడెం, 50వ డివిజన్ బుర్హాన్‌పురం/మామిళ్లగూడెం, 60వ డివిజన్ రామన్నపేట ప్రాంతాల్లో దరఖాస్తులు స్వీకరించబడతాయని తెలిపారు.